ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

మళ్లీ పాత కథేనా..?

తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ మంచి గున్నది. భూములు భద్రంగా ఉంటయ్. రైతుల పేరిట ఉన్న భూములను కబ్జాకు అవకాశం లేదు. అసల్దారు సంతకం పెడితేనే ఇంకొకరి మీద కు మార్కుకొనే అవకా శం ఉంటది. అట్లనే పది, పదిహేను నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్లు అయిపోతున్నయ్. పైసా లంచం ఇవ్వక్కర్లేదు. కానీ కాంగ్రెస్ ఉన్నప్పుడు భూమి మార్పిడి చేసుకోవాలంటే మస్తు తిప్పలయ్యేది. ఆఫీసుల చుట్టూ తిరిగితిరిగి వేసారిపోయేది. పట్వార్లు ఉన్నప్పుడు ఇష్టమొచ్చినట్లు చేసేది. తప్పుల తడకతో పాసు బుక్కులు ఇచ్చేది. అందులో సవరణల కోసం మళ్లామళ్లా తిరుగాల్సి వచ్చేది. ఇప్పుడు ధరణి పుణ్యమా అని గా బాధలు తప్పినయ్. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏదో భూమాత అంటున్నరు. అంటే మళ్లా పాతరోజులే వస్తయ్.

-ఎర్రబెల్లి పాపరావు ఓడేడ్ (ముత్తారం మండలం)

పైసలియ్యకపోతే పనికాదు

భూమి ఉన్న రైతులకు బతుకుమీద భరోసా ఉంటది. వాళ్లు ఆత్మగౌరవంతో బతికే అవకాశం ఉంటది. కాంగ్రెస్ ఉన్నప్పుడు భూ సమస్యలు పరిష్కారం కాక మత్తు తిప్పలపడాల్సి వచ్చేది. పనులు ఇడిపిపెట్టి ఆఫీసుల పాంటి తిరుగాల్సి వచ్చేది. ఏ ఊరికి పోయినా భూమిల పంచాయితీలే ఉండేవి. అందుకే తెలంగాణ స్కార్రు భూ రికార్డుల ప్రక్షాళన చేసిన్రు. ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించిన్రు. సాధాభైనామాలున్న వారికి రిజిస్ట్రేషన్ చేసిన్రు. భూమి వివరాలు, అమ్మకం కొనుగోళ్లను సులభతరం చేసేందుకు ధరణి పోర్టల్ తెచ్చిన్రు. సీఎం కేసీఆర్ పాలనలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ ను కాంగ్రెస్ పార్టీ తీసివేస్తామనడం వారి తెలివిలేనితనానికి నిదర్శం. ధరణి తీసేస్తే మళ్లీ తెలంగాణలో దళారులదే రాజ్యం అయితది. ఎన్నట పహాణీ కావాలని పట్వారీ దగ్గరికి పోతే పైసలియ్యందే పని కాకపోయేది. ఇప్పుడు రెండు నిమిషాల్లల ఆన్‌లైన్‌లో పహాణీ వస్తున్నది.

-కాసర్ల స్వయం పుకాశెర్రెడ్డి. రైతు. మల్కాల. (కాల్వశ్రీరాంపూర్)

ధరణి ఎత్తివేస్తే దోపిడే

- మళ్లీ ఎనకటి 'కాలం' వస్తది
- పైరవీకారులు రాజ్యమేలుతరు
- లంచావతారులు పుట్టుకొస్తరు
- పహాణీ కావాలన్నా కాళ్లరిగేలా తిప్పుకుంటరు
- రైతులను కాంగ్రెస్ ముంచాలని చూస్తున్నది
- ఆ పార్టీ నాయకులను నమ్మవి లేదు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

కరీంనగర్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గతంలో భూమి హక్కులకు సంబంధించి అనేక రికార్డులు ఉండేవి. ముఖ్యంగా రెవెన్యూ అధికారుల చేతుల్లో 11 రకాల రికార్డులు నిర్వహించేవారు. ప్రభుత్వ, ప్రైవేట్, రైతు ల భూములు ఇలా అన్ని రకాల భూముల వివరాలు వాళ్ల చేతుల్లోనే ఉండేవి. ఒక్కో రికార్డులో మళ్లీ పదుల సంఖ్యలో కాలమ్స్ ఉండేవి. అధికారులే రాతపద్ధతిలో ఆ లెక్కల్లో మార్పు లు, చేర్పులు చేసేవాళ్లు. ఇక్కడే పిచ్చుల విడి అవినీతి జరిగేది. ముఖ్యంగా పహాణీలో అక్రమాలకు అంతులే కుండాపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణిలో ఉన్న రికార్డులో మార్పులు, చేర్పులు చేసే అధికారాన్ని కిందిస్థాయి అధికారులకు లేకుండా చేసింది. ఏదైనా సమస్య ఉంటే రైతు దరఖాస్తు పెట్టుకున్న తర్వాత.. కలెక్టర్ మాత్రమే పరిశీలించి మార్పు చేసే అవకాశం కల్పించింది. గతంలో మాదిరిగా వీఆర్వోలు, ఆర్ ఐలు, ఎమ్మార్వోలు, ఆర్డీవోలు ఇష్టం వచ్చినట్టు రికార్డులు మార్చే సంస్కృతికి చరమగీతం పాడింది. ఏకంగా వీఆర్వో వ్యవస్థనను రద్దు చేసింది. అయితే, ఇటీవల కాంగ్రెస్ నాయకులు ధరణిని రద్దు చేసి పాత పద్ధతినే తెస్తామని చెబుతుండడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పాత పద్ధతి తెస్తే మళ్లీ రైతులు భిక్షమెత్తుకోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. పైరవీకారులు రాజ్యమేలుతారని, లంచావతారులు పుట్టుకొస్తారని, ఏ చిన్న పనికైనా అధికారులు తమ చుట్టూ ఏండ్ల తరబడి తిప్పుకుంటారని, రికార్డులు తారుమారు చేసి ఒకరికొకరికి మధ్య పంచాయితీలు పెట్టిస్తారని వాపోతున్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులను ముంచాలని చూస్తున్నదని మండిపడుతున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ వారిని నమ్మేది లేదని, తప్పకుండా బుద్ధి చెప్తామని స్పష్టం చేస్తున్నారు.

దళారులే రాజ్యం ఏలుతరు..

ధరణి పోర్టల్‌తోనే రైతుల భూములు భద్రంగా ఉంటున్నాయి. రైతు వేలి ముద్ర పెడితేనే ఇంకొకరి పేరు మీదకు మారుతుంది. రైతుల ప్రయేయం లేకుండా వారి భూమిని ఇంకొకరు మార్చుకొనేందుకు అస్సలు వీలు లేదు. అలాగే రిజిస్ట్రేషన్ కూడా 15 నిమిషాల్లో పూర్తవుతుంది. ఏ దళారీ వద్దకు తిరగాల్సిన అవసరం లేదు. పైసా లంచం ఇవ్వాల్సిన అక్కరలేదు. కాంగ్రెస్ పార్టీ వాళ్లు అంటున్నట్టు భూమాత పోర్టల్ తీసుకువస్తే మళ్లీ పాత రోజులు వచ్చినట్లే. తహసీల్దార్ కార్యాలయం మొదలు గ్రామాల్లో దళారులే రాజ్యం ఏలుతారు. కౌలుదారు, అనుభవదారు కాలం పెడితే మళ్లీ చిక్కులు వచ్చినట్లే. మళ్లా కొట్లాటలు మొదలవుతయ్. కొందరు భూములను కౌలుకు ఇస్తే పట్వారీల ద్వారా తమ పేరు మీద పట్టా చేయించుకున్న సందర్భాలు అనేకంగా చూసినం. కాంగ్రెస్ పార్టీ భూమాత పోర్టల్‌తో గ్రామాల్లో అలజడులకు ఆస్కారం ఉంటుంది. భూమాత వద్దే, వేద్దు, ధరణియే బెస్ట్.

- పల్కల సర్పింహారెడ్డి. రైతు, కొమిరె (ఓదెల)

భూమాత వస్తే భూతగాదాలు వత్తయ్..

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే భూమాత తేస్తామంటున్నరు. దీంతో భూతగాదాలు వత్తయ్. మళ్లా పైరవీకారులు పుట్టుకు వస్తారు.

రైతులను పీక్కుతింటరు. రైతుకు తెలియకుండానే భూమి ఇంకొకరి పేర మీదకు ఎక్కుంచుకోవచ్చు. రైతులు ఎప్పుడు రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరుగుతూ తన భూమి తనకు ఉందా లేదా అని చూసుకోవాల్సి వస్తుంది. పట్వారీలు పైసలు లేనిదే పైల్ కదలనివ్వరు. ఒకన భూమి ఇంకోని పేరుమీద రాస్తరు. భూస్వాముల పెత్తనం మళ్లా మొదలైతది. ధరణి వచ్చిన తర్వాతనే గ్రామాల్లో భూసమస్యలు లేకుండా పోయినయ్. రైతు వేలి ముద్ర పడనిది ఇంకొకరు పేరు మీదకు మారదు. ధరణి వల్ల లంచాలు, పైరవీకారులు పోయింన్రు. ధరణియే ఉండాలి. అప్పుడు రైతుల భూములు భద్రంగా ఉంటాయి.

- వంగళ కొండాల్‌రెడ్డి, రైతు, జీలకుంట (ఓదెల)

కాంగ్రెస్ వస్తే పట్వార్లు వస్తరు

ఇప్పుడు ప్రభుత్వం తెచ్చిన ధరణి వ్యవస్థ మంచిగున్నది. అల్కగా రిజిస్ట్రేషన్లు అవుతున్నయ్. దూరంల ఉన్న ఆఫీసుల చుట్టూ తిరిగే గోస తప్పింది. కానీ కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి ధరణిని బంగాళాఖాతంల కలుపుతా అంటున్నడు. ఆ పార్టీకి చెందిన పెద్ద నాయకుడు రాహుల్‌గాంధీ కూడా అదే మాట్లాడుతున్నడు. వాళ్లకసలు బుర్ర ఉండి మాట్లాడుతున్నరో నాకైతే సమజైతలేదు. ధరణిని తీసేస్తే పట్వార్లు వస్తరు. మళ్లా లంచం తీసుకొనేటోళ్లు పుట్టుకొస్తరు. ఇగ మళ్లా కార్యాలయంల కాడనే పడిగాపులు కాయాల్సి వస్తది. అందుకే ఆ పార్టీని నమ్మద్దు. ఓటుతో వాళ్లకు తగిన బుద్ధి చెప్పాలె.

- కట్యూరి రాజిరెడ్డి, ఓడేడ్ (ముత్తారం)

ఖర్చులు తడిసి మోపెడైతయ్..

మాది బొమ్మారెడ్డిపల్లి గ్రామం. నాకు 2 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. మా ఊరు గుట్టల మధ్య ఉన్నది. ఎక్కువ మంది రైతులు వ్యవసాయ పంపుసెట్లు ఉపయోగించి భూములు సాగు చేస్తం. ఇక్కడ అత్యధికంగా కరెంటు వినియోగం అవుతుంది. భూములు ఎత్తు ప్రాంతంలో ఉండడంతో భూగర్భ జలాలు లోతులో ఉంటయ్. ఇప్పుడు ఇక్కడి గ్రామ రైతులం 3 హెచ్‌పీ ,5 హెచ్‌పీ లోపు కరెంటు మోటార్లు వినియోగిస్తన్నాం. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటున్నరు. అట్లయితే రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. ఖర్చులు తడిసిమోపెడ వుతయ్. ప్రస్తుతం బీఆర్ఎస్ ఇస్తున్న కరెంట్ సరఫరా విధానమే బాగుంటుంది.

-సింగిరెడ్డి జైపాల్‌రెడ్డి. రైతు- బొమ్మారెడ్డిపల్లి (ధర్మారం మండలం)

నువ్వద్దు.. నీ కరెంటద్దు

కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడే

- యాభై ఏండ్లలో చేసేందేమీ లేదు
- ఇప్పుడొచ్చి మళ్లీ మాయమాటలు చెబుతున్రు
- సృష్టం చేస్తున్న రైతులోకం



కరీంనగర్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కాంగ్రెస్ మొదటి నుంచి రైతు వ్యతిరేకిగా ఉన్నది. యాభై ఏండ్లకుపైగా పాలించినా రైతులకు చేసిందేమీలేదు. కరెంట్ సక్కగా ఇయ్యలె. నీళ్లు సక్కగా ఇయ్యలె. పంటలు ఎండిపోతున్నా పట్టించుకోలె. ఆఖరుకు అప్పుల బాధతో సచ్చిపోయినా ఆదుకోలె. మళ్లీ ఆ పార్టీ నాయకులు ఇప్పుడొచ్చి మాయమాటలు చెబుతున్రు. బీఆర్ఎస్ సర్కారు 24గంటల కరెంట్ ఇస్తాంటే.. మేమేదో చేస్తామంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్రు. మమ్మల్ని ఆగం చేయాలని చూస్తున్రు. మళ్లీ మేం మోసపోం. మా బతుకుల్లో మట్టి పోసుకోం' అని జిల్లా రైతులు స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు రైతుల కోసం 24 గంటల కరెంట్, సాగునీరు, రైతుబంధు, రైతు బీమా ఇస్తున్నదని, అన్నదాతలు ఇప్పుడిప్పుడే సంతోషంగా బతుకున్నారని చెబుతున్నారు. కానీ, కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నదని, అందుకే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, మంచి పథకాలను రద్దు చేస్తామంటున్నదని మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధిపొందాలన్న ఉద్దేశ్యంతో అబద్ధపు హామీలు, ఊూటా మాటలు చెబుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో అలాగే చెప్పి నిండా మోసం చేసిందని, ఇప్పుడు ఇక్కడ ఇలాగే చేయాలని చూస్తున్నదన్నారు. కరెంట్‌పై పూటకోమాటతో పరేషాన్ చేస్తున్నదని, ఓసారి 3గంటల కరెంట్ సరిపోతుందని, అదేలా సాధ్యమంటే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నారని మండిపడుతున్నారు. అసలు వ్యవసాయ బోర్లకు ఆ మోటర్లు పెట్టుకుంటారా..? ప్రశ్నించారు. అవి పెట్టాలంటే ఒక్కో రైతుపై లక్షకుపైగా ఖర్చవుతుందని, ఆ పైసలు వాళ్ల ఇంట్ల నుంచి ఇస్తారా..? అని ద్వజమెత్తారు. పెద్ద మోటర్లు పెట్టుకుంటే కరెంటు సరిపోతదా..? బావుల్లో, బోర్లలో నీళ్లు ఊర్తయా..? నీటి ప్రెషర్‌ను పైపులు తట్టుకుంటయా..? లోడ్ పడి ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా..? అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఎద్దెర్కనా..? ఎవుసమెర్కనా..? నిలదీస్తున్నారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో తాము ఎదుర్కొన్న చీకటి కష్టాలు మళ్లీ వద్దని రైతన్నలు ముక్తకంఠంతో స్పష్టం చేస్తారు. ఈ కాంగ్రెసోళ్లు మా బతుకులు ఆగం చేయాలని చూస్తున్నారని, వాళ్ల మాటలతో మోసపోమని స్పష్టం చేస్తున్నారు. రైతుకు అన్ని విధాలా అండగా నిలిచిన బీఆర్ఎస్ సర్కారునే మళ్లీ గెలిపించుకుంటామని చెబుతున్నారు.

భూగర్భ జలాలు అడుగంటుతయ్..

నాకు గ్రామంలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. తీరొక్క రకాల పంటలు పండిస్తూ ఉంట. ఇప్పుడు కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయ పంప్ సీట్లకు 10 హెచ్‌పీ మోటార్లు పెట్టాలని అంటున్నడు. రైతులకు ఈ ప్రాంతంలో 10 హెచ్‌పీ మోటార్లు కొనే ఆర్థిక సోమత ఉండదు. రైతులపై తీవ్ర భారం పడుతుంది. 10 హెచ్‌పీ మోటార్లను వినియోగిస్తే బావిలో భూగర్భ జలాలు అడుగంటతయ్. రైతులు ఇక్కట్లు పడక తప్పదు. 10 హెచ్‌పీ తట్టుకునే సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్లకు ఉండదు. హై వోల్టేజ్ సమస్యతో కాలిపోయి రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. ఎవుసం గురించి తెలియకనే రేవంత్ అట్లా మాట్లడుతున్నడు. అందుకే ఆ పార్టీని రైతులెవరూ నమ్మడం లేదు.

- గడ్డం చుక్కారెడ్డి, రైతు - బొమ్మారెడ్డిపల్లి (ధర్మారం మండలం)

అప్పుడు రైతులను చూస్తే బాధేసేది

నేను పదహారేండ్ల సంది వైండర్‌గా పని చేస్తున్న. తెలంగాణ రాక ముందు పెద్దపల్లి చుట్టు పక్కల ఊర్ల నుంచి రోజుకు నాలుగైదు మోటర్లు వైడింగ్ కాలిపోయి నావద్దకు వచ్చేవి. రాత్రింబవళ్లు వైండింగ్ చేసేది. రైతులు పొద్దున్నే నా దగ్గరికి వచ్చేది. అన్న 'నా మోటర్ ముందు చెయ్' అంటే.. 'నా మోటర్ ముందు చెయ్' అనెటోళ్లు. 'పాలం ఎండిపోతంది. చేసిన కష్టం వృథా అయితది. జెరా నీ పుణ్యం. జెల్దీ చేస్తే నా పంట పండుతుంది' అని రైతులు దీనంగా చెప్పెటోళ్లు. వాళ్లు అట్ల బతిమిలాడుతుంటే నాకు చాలా బాధేసేది. చాలీచాలని కరెంట్‌తో మోటర్లు కాలిపోయేవి. ఒక్కోసారి అయితే ఒక రైతుదే నెలలో రెండు మూడుసార్లు మోటరు కాలిపోయేది. పొద్దంతా ఇక్కడే ఉండి మోటర్లు వైండింగ్ చేయించుకునే వెళ్లే వాళ్లు. కానీ, తెలంగాణ అచ్చినంక 24 గంటలు నాణ్యమైన కరెంట్ ఇస్తుండడంతో మోటర్లు కాలిపోవడం లేదు. రైతులు సంతోషంగా పంటలు పండిస్తున్నరు. వైండింగ్ గిరాకీ లేక చిన్నగా ఎలక్ట్రికల్ షాపు పెట్టిన. ఫ్యాన్లు, కూలర్లు రిపేర్లు చేస్తున్న. ఆదాయం బాగానే వస్తున్నది. మాకు వైండింగ్ గిరాకీ లేకున్నా మంచిదే గానీ, రైతుల గోస అయితే దీరింది. సీఎం కేసీఆరే చెయ్యబట్టే ఇది సాధ్యమైంది.

-పాలం సతీశ్‌యాదవ్, వైండర్ (పెద్దపల్లి)

మూడు గంటలిస్తే మూల గూడ తడువదు

మాది కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి. నాకు 6ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో పత్తి, వరి పంటలు సాగు చేస్త. సీఎం కేసీఆర్ సార్ ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో ఎలాంటి రంది లేకుండా పంటలు పండుతున్నయ్. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇస్తామని చెబుతున్న 3గంటల కరెంట్ తో ఎకరం పొలం కూడా తడువదు. ఈ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్ తో అవసరం ఉన్నప్పుడల్లా పంటలు పండిచ్చుకుంటున్నం.మూడు గంటల కరెంట్ తో మూల కూడా పారదు. 3గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెసోల్లు మాకద్దు. రైతులను ఆదుకుంటున్న బీఆర్ఎస్ సర్కారుకే జై కొడతాం.

- సుముఖం మల్లారెడ్డి. రైతు. పెగడపల్లి (కాల్వశ్రీరాంపూర్)

మోటర్ల కాడా చలిమంటలు పెట్టుకొనేది..

ఎన్నట కాంగ్రెస్ ఉన్నప్పుడు కరెంట్ కోసం ఆగ్గమైనం. రాత్రి వేళ పొలాలవద్ద చలిమంటలు పెట్టుకొని ఎదురు చూసేది. పంటల కోసం రైతులకు మూడుగంటల కరెంట్ ఏం మొద లైదది. బీఆర్ఎస్ సర్కారు రైతులపై ఉన్న ప్రేమతో 24 గంటల కరెంట్ ఇత్తుండి. ఎప్పుడు పడితే అప్పుడు పొలం దగ్గరికి పోయి పొలం పారిచ్చుకుంటున్నం. కాంగ్రెసోల్ల మాటలు నమ్మేంత బుద్ధి తక్కువోల్లం కాదు. 3గంటల కరెంట్ ఇచ్చి, 10 హెచ్‌పీ మోటార్లు పెడతామంటే అందరికీ ఎల్లుతదా. తెలంగాణ వచ్చినం కనే భూములు రేట్లు మస్తు పెరిగినయ్. ఇప్పుడిచ్చే కరెంట్ మంచిగున్నది. అందుకే కాంగ్రెస్‌ను నమ్మం.

- పులి రాంరెడ్డి. రైతు (కాల్వశ్రీరాంపూర్)

ఎవుసం గురించి తెలిసినోళ్లు ఇట్ల మాట్లడరు

సీఎం కేసీఆర్ సారు అచ్చినం కనే రైతులకు మేలు జరుగుతున్నది. రైతుబంధు ఇస్తుండడంతో పెట్టుబడికి రందీలే కుండా పోయింది. అట్లనే ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తున్నది. రెండు పంటలు పుష్కలంగా పండించుకుంటున్నం. రైతులు కూడా సంతోషంగా ఉన్నరు. కాంగ్రెసోల్లు మూడు గంటల కరెంటు ఇస్తే చాలంటున్నరు. కానీ మూడు గంటల కరెంట్ ఇస్తే 30 గంటలు కూడా పారది. భూమీ ఎక్కువ ఉన్న రైతులు ఎక్కడిపోవాలే. వ్యవసాయం గురించి తెలిసినోళ్లు గిట్ల మాట్లాడరు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులు భూములను బీడు ఉంచుకోనే పరిస్థితి వత్తది.

-కే రాజిరెడ్డి. రైతు (ముత్తారం మండలం)

నమ్మితే ఆగమవుడే

కాంగ్రెస్ పాలన ఉన్నప్పుడు కరెంట్‌కు మస్తు తిప్పలయ్యేది. ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతున్నదో తెలియకపోయేది. తెల్లందాక మోటర్ కాడనే నిద్రపోయేది. లోవోల్టేజ్ కరెంట్‌తో మోటర్లు సతాయిత్తే రిపేరు చేసేసరికి కరెంటు పోయేది. పంటలు సగంలనే ఎండిపోయేది, కాని బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంకనే రైతుల కష్టాలు దూరమైనయ్. కరెంటు సమస్యతో పంటలు ఎండిపోయిన సందర్భాలు ఇప్పుడు లేవు రైతు పక్షపాతి కేసీఆర్ సారుకు మళ్లీ ఓటేసి గెలిపించుకోనుడే. కాంగ్రెస్‌కు ఓటస్తే రైతులు ఆగంకాకతప్పదు.

-అల్లం రాజేశం, ముత్తారం (ముత్తారం)

కాంగ్రెస్ వస్తే మళ్ల కరెంట్ కష్టాలే

10 హెచ్‌పీ మోటర్ పెట్టుకుని ఏవ్వసం చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెబుతేనే తెలుస్తుంది. ఇప్పటిదాకా రైతులం మీది మోటర్ అయితే 3హెచ్‌పీ, నీళ్లల్లది అయితే 5హెచ్‌పీ మోటర్ పెట్టుకుకోవడమే తెలుసు. 10హెచ్‌పీ మోటర్‌కు మన ట్రాన్స్‌ఫార్మర్లు పని చేస్తయా..? అందరం ఒకే సారి మోటర్లు పెడితే కరంట్ తట్టుకుండదా..? ఇవేమి తెలియక కాంగ్రెసోళ్లు ఏట్లా మాట్లాడుతున్నారో రైతులం నవ్వుకోవాల్సి వస్తుంది. గతంల కాంగ్రెస్ హయంలో రైతులం కరంట్ గురించి పడ్డ కష్టాలు ఇంకా మరువనే లేదు. లోవోల్టేజితో మోటర్లు ఎండిపోయేది. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేది. ఇప్పుడు ఎన్నికల టైంల కాంగ్రెస్ నాయకుల మాటలు అసలే నమ్మం. వాళ్లు వస్తే అంతా ఆగమవుతది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంకనే కరంట్ 24గంటలు ఇస్తుర్రు. ఏవ్వసం మంచిగ చేసుకుంటున్నం. 10హెచ్‌పీ మోటర్లు అంటున్న గసోంటి కాంగ్రెసోళ్లకు ఏట్లా ఓట్లు వేస్తం, ఎయ్యం.

- జీల రాజేందర్, రైతు, శాసగొండ (ఓదెల)

అప్పుడు రిజిస్ట్రేషన్ కోసం అరిగోసపడ్డం..

కాంగ్రెస్ ఉన్నప్పుడు భూమిల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటనే భయమయేది. 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దపల్లికి పోవాల్సి వచ్చేది. ఒక్కరోజా పని అయ్యేది కాదు. దీంతో మళ్లా మళ్లా కార్యాలయాల సుట్టూ తిరుగాల్సి వచ్చేది. లంచం ఇస్తేమేగాని కాగితాలు చేతులకు వచ్చేవి కాదు. మ్యూటేషన్ కోసమైతే చెప్పులరిగేలా తిరుగాల్సి వచ్చేది. కానీ సర్కారు తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల మండలఆఫీసులోనే రిజిస్ట్రేషన్లు జేత్తున్నరు. ఇప్పుడు మంచి సౌలత్ అయ్యింది. సీఎం సార్ ధరణి తీసుకవచ్చి భూములకు భద్రత కల్పించిండు. రైతులు కూడా సంతోషంగా ఉన్నరు. భూమాత తెస్తామన్న కాంగ్రెస్సోళ్ల మాటలు ఎవలూ నమ్మరు.

-వంగల కోమాల్‌రెడ్డి. రైతు. ఇద్లాపూర్. (కాల్వశ్రీరాంపూర్)

మూడు గంటలు ఎట్ల సాల్తది

రేవంత్‌రెడ్డి..ఎవుసానికి మూడు గంటల కరెంట్ సాలంటున్నడు. గిట్లయితే ఏ మూలకు సరిపోదు. రెండు మడులు కూడా పారవు. గిది గూడ తెల్వని కాంగ్రెసోళ్లను ఏమనాలో అర్థమైతలేదు. ఆయనకు ఎవుసం చేశ్తనేమో ఎరుకైతది. దుక్కి దున్నడం తెలుసా? పంట చేతికచ్చేదాకకెంత తిప్పలుంటయో తెలుసా? ఏం తెలుసు ఆయనకు అని అడుగుతున్న ఎవుసమంటే తీసి పారేసినట్టే మాట్లాడుతున్నరు. 3గంటల కరెంటు ఎవరి ముక్కులో పెడ్తరట. ఇప్పుడు సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇత్తనే బ్రహ్మాండంగా పంట చేతికత్తుంది. ఇగ 3 గంటల కరెంటుతో మేమెక్కడ ఎవుసం చేత్తం. నాకు గ్రామంలో 3 ఎకరాల భూమి ఉన్నది. అందులో ఏటా మిర్చి, వరి, పత్తి సాగుచేస్తున్న. కేసీఆర్ పుణ్యమాని 24 గంటల ఉచిత కరెంటుతో ఏ రందీ లేకుండ ఉన్నది. 3 ఎకరాలకు నీళ్లు పట్టుండి. కాంగ్రెసోళ్లు చెప్పినట్టు 3 గంటల కరెంటు ఇత్తే... ఒక్క ఎకరం కూడా పారడం కష్టమే. మరి మిగత 2 ఎకరాలు ఎండుడేనా? నాదంటే పక్కన బెట్టు..పదెకరాలు ఉన్న రైతు పరిస్థితి ఏది? 3 గంటలకు మూడెకరాలు కూడా తడ్వది. ఇక పదిఎకరాలు ఎట్ల తడ్తది..మాట్లాడితే దిమాగున్న మాటలు మాట్లాడాలె. ఇంక 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలె అంటర్రు. ఆ మోటార్లకు పైసలు ఎవ్వలు ఇత్తరు? కింది నుంచి ఫీజు వరకు పైపులు, వైర్లు అన్ని మార్చాల్సి వస్తది. ఎంత లేదనుకున్న 50 నుంచి 70వేల పైన మాటే ఖర్చు అవ్వది.. పైగ కరెంటు మీద బర్డెన్ పడి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే ఎవరు భాద్యులు. పంట చేతికచ్చే పరిస్థితి ఎట్ల..? ఇప్పుడు నాకున్న 3 హెచ్‌పీ మోటర్ పీకి ఏడ పారెయ్యాలె మరి.

- దాసిపెల్లి రాజిరెడ్డి, ఆదివారంపేట (రామగిరి మండలం)

పెద్ద మోటర్లతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలుతయ్

బోర్లకు పెద్ద మోటర్లు పెడితే భూములు నీళ్లు ఇంకిపోతయ్. పైపులైన్లు, శాటర్లు మార్చాల్సి వత్తది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. ఖర్చు బాగ అయితది. ఎవ్వసం బంద్ పెట్టి వేరే పనులు జూసుకోవాల్సి వత్తది. ఇవన్నీ తెలువకనే కాంగ్రెస్సోళ్లు ఇష్ట మొచ్చినట్టు మాట్లాడుతున్నరు. వాళ్లను రైతులెవరూ నమ్మబోరు. వచ్చే ఎన్నికల్ల ఓట్లతోటి బుద్ధి చెబుతరు.

- పిడుగు మల్లయ్య. పెంచికల్‌పేట. (కమాన్‌పూర్ మండలం)